
సాక్షి
విజయనగరం
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



ఐదు గేట్లు ఎత్తివేత

వంగర: వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల్లో నీటిప్రవాహం పెరిగింది. 11వేల క్యూసెక్కుల నీరు మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఐదు గేట్లను ఎత్తివేసి ప్రాజెక్టులో చేరుతున్న నీటిని కిందకు విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 64.21 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

బిత్రపాడులోనే ఏనుగుల గుంపు



జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర, నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు సోమవారం ఉదయం దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పామాయిల్ తోటలో ఉండి గుమ్మిడిగెడ్డ వాగులోకి జారుకున్నాయి. సాయంత్రానికి నిమ్మలపాడు నుంచి బిత్రపాడు పరిసర ప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చాయి. చీకటి పడిన సమయంలో గ్రామంలోకి ఏనుగులు వస్తాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ సిబ్బంది ఏనుగులను తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

నెల్లిమర్ల: నెల్లిమర్ల పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను నెల్లిమర్ల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారితో పాటు గంజాయి కొనుగోలు చేసిన మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు భోగాపురం సీఐ జి.రామకృష్ణ తెలిపారు. పూడమ్మ తల్లి వనుంగుడికి వెళ్లే దారిలో విజయనగరానికి చెందిన దువ్వ సుబ్బు, వానపల్లి బలరాం అనే వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై రామ గణేష్ ఆధ్వర్యంలో దాడి చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కేజీపావు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కొనుగోలు చేసిన మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.

ఉద్యోగులకు ఓపీఎస్ హామీ అమలు సాహసమే!

- టీడీపీ కూటమి ప్రభుత్వం అమలుచేస్తే చట్ట సభలకు పోటీ చేయను
- మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర సవాల్



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ హామీ ఇచ్చిన ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను నిజంగా అమలుచేస్తే అదొక సాహసమేనని, టీడీపీ కూటమి ప్రభుత్వం దాన్ని అమలుచేస్తే తాను భవిష్యత్తులో చట్టసభలకు పోటీ చేయబోనని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సవాల్ విసిరారు. సాలూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఓపీఎస్‌ను అమలుచేయాలని ఉద్యోగ సంఘాలు కోరిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఓపీఎస్ అమలు కష్టసాధ్యం కాబట్టే ప్రత్యామ్నాయంగా నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీపీఎస్ (గ్యారెంటీడ్ పెన్షన్ సిస్టమ్) బిల్లు తీసుకొచ్చారని వివరించారు. దీనిని ఉద్యోగులు నాడు వ్యతిరేకించిన విషయాన్నీ గుర్తు చేశారు. ఇప్పుడా జీపీఎస్‌నే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) పేరుతో అమలుచేయనుందని చెప్పారు. గత వారం కేంద్ర కేబినెట్ దీనికి ఆమోదముద్ర వేసిందన్నారు. పొరుగు రాష్ట్రాలే కాదు కేంద్ర ప్రభుత్వం కూడా జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలను అనుసరిస్తున్నాయనడానికి ఇదో నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఇప్పుడీ పరిస్థితుల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ఎన్నికలకు ముందు ఉద్యోగులకు పదేపదే హామీ ఇచ్చిన ఓపీఎస్‌ను రాష్ట్రంలో అమలు చేయాలని రాజన్నదొర డిమాండ్ చేశారు. తానొక ప్రభుత్వ మాజీ ఉద్యోగిగా, మరో ప్రభుత్వ ఉద్యోగి భర్తగా తనకు ఉద్యోగుల ఆకాంక్ష ఏమిటో స్పష్టంగా తెలుసన్నారు. ఓపీఎస్ అమలుకోసం పోరాడే ఉద్యోగులకు మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

సంక్షేమ పాలనకు చిరునామా వైఎస్సార్



చీపురుపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు సోమవారం ఊరూరా జరిగాయి. మహానేతను ప్రజలు మనసారా స్మరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఆయన జిల్లాకు చేసిన మేలును.. బడుగుబలహీన వర్గాలకు అందించిన సంక్షేమ పాలనను గుర్తుచేసుకున్నారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- ఊరూరా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- వివిధ సేవాకార్యక్రమాల్లో నిమగ్నమైన పార్టీ శ్రేణులు, అభిమానులు
- దేశంలోనే మహానేత పథకాలు ఆదర్శవంతం
- మళ్లీ రాజన్నరాజ్యం తెచ్చేందుకు కలిసికట్టుగా శ్రమిద్దాం
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన పిలుపు



గజపతినగరం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, పార్టీ శ్రేణులు, అభిమానులు



బొబ్బిలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

చీపురుపల్లి:

దేశంలోనే సంక్షేమ పాలనకు చిరునామాగా దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చరిత్ర సృష్టించారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి సోమవారం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు విద్య, వైద్యం సక్రమంగా అందినప్పుడే వారు ఆత్మస్థైర్యంతో ఎదుగుతారనే ఆశయంతో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలు తీసుకొచ్చారన్నారు. దేశంలోనే ఆదర్శవంతంగా నిలిచిన అలాంటి ఎన్నో పథకాలను గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించారని చెప్పారు. మహానేత ఆశయాలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఉందన్నారు. ప్రతీ అంశంలోనూ పేదల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు. అప్పుడే వైఎస్సార్‌కు ఘనమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కాకముందే వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రంలోని పరిపాలన గాలికొదిలేసిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా ప్రజలను జ్వరాలు వణికిస్తున్నా ప్రభుత్వ పెద్దలకు పట్టడంలేదని విమర్శించారు. విద్య, వైద్యంను పేదలకు అందకుండా నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. వర్షాలపై కేంద్ర ప్రభుత్వం వారం రోజుల కిందటి నుంచే హెచ్చరిస్తున్నా పట్టించుకోనందువల్లే విజయవాడ, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో 5 లక్షల మందికి పైగా వరదల్లో చిక్కుకుని ఆకలితో అలమటిస్తున్నారని ఆరోపించారు. తెలుగు జాతి ఉన్నంత వరకు మహానేత వైఎస్సార్ గుర్తుంటారని, సంక్షేమం అంటే ముందుగా ఆయనే గుర్తొస్తారని చెప్పారు.



నెల్లిమర్ల: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకులు



ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,నాయకులు

పేదల గుండెల్లో వైఎస్సార్ ముద్ర

మహానేత వైఎస్సార్ పరిపాలనలో దేశ చరిత్రలో లేని సంక్షేమ పరిపాలన అమలు చేసి రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. రైతుభరోసా, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్య వంటి ఎన్నో పథకాలు అమలు చేసి పేదలకు దేవుడిగా మారారన్నారు. పేదలు ఆరోగ్యశ్రీ పథకం కోసం ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారని, నిరంతరం వైఎస్సార్‌ను స్మరించుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హత్యలు, మానభంగాలు, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకే ప్రాధాన్యమిస్తోందని విమర్శించారు. మళ్లీ రాజన్న పరిపాలన తెచ్చేందుకు కలిసికట్టుగా కృషిచేద్దామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, బెల్లాన త్రినాథరావు, దాలయ్య, ముల్లు పైడిరాజు, కర్రోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజాంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్

విద్యుత్‌షాక్‌తో బాలుడి మృతి



విద్యుత్ షాక్‌తో చనిపోయిన చిన్నారి శ్యామ్

శృంగవరపుకోట: ముచ్చటగా మూడేళ్లు నిండాయి. చిన్నచిన్న పదాలు పలుకుతున్న చిన్నారిని చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఇంతలోనే విధి కన్నెర్ర చేసింది. విద్యుత్‌షాక్ రూపంలో చిన్నారిని మృత్యువు కాటేసింది. తల్లిదండ్రుల ఆనందాన్ని ఆవిరి చేసి శోకసంద్రంలో ముంచేసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్.కోట మండలం మూలబొడ్డవర పంచాయతీ పరిధిలోని మరుపల్లి గ్రామానికి చెందిన రంసాల శ్యామ్(4) అనే బాలుడుని సోమవారం ఉదయం తల్లి చక్కగా ముస్తాబుచేసి అంగన్‌వాడీ కేంద్రానికి పంపించింది. తుఫాన్ కారణంగా ప్రభుత్వం సెలవు ఇవ్వడంతో బాలుడు ఇంటికి వచ్చాడు. చొక్కా వేసుకుని వీధిలో స్నేహితులతో కలిసి దొంగాపోలీస్ ఆటలో నిమగ్నమయ్యాడు. ఉదయం 10 గంటల సమయంలో ఆటలాడుతూ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం వెనకాల దాక్కున్నాడు. పొరపాటున స్తంభానికి తగలడంతో షాక్‌కు గురై పడిపోయాడు. పిల్లలు కేకలు వేయడంతో తల్లిదండ్రులు, పొరుగు వారంతా వచ్చి బాలుడిని హుటాహుటిన ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో మరుపల్లి శోకసంద్రం అయ్యింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు చనిపోవడంతో 8 నెలల గర్భిణి అయిన తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్, ఎస్.కోట సీఐ, ఎస్ఐలు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై ఏఈ రవికుమార్ మాట్లాడుతూ పరిసరాలు తడిగా ఉండడం, స్తంభంపై ఉన్న సర్వీస్ వైర్లు స్తంభానికి తాకి ఉండడం, స్తంభంలోని ఇనుప చువ్వల ద్వారా భూమిలోకి విద్యుత్ ప్రసరించిందని, ఆ సమయంలో బాలుడికి చెప్పులు లేకపోవడం, దుస్తులు వేసుకోకపోవడంతో షాక్‌కు గురై ఉంటాడని చెప్పారు. స్తంభంలో ఎటువంటి లోపాలు లేవన్నారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మృతుని కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆరోగ్యశ్రీ సేవలపై ఫిర్యాదు వస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్


- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) పథకం కింద ఆరోగ్య సేవలు పొందిన వారి నుంచి ఫిర్యాదులు వస్తే ఆస్పత్రులపై చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌లో ఫీడ్‌బ్యాక్ నెగటివ్‌గా వస్తే సహించేది లేదన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 23 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా గత 8 నెలల్లో 32 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటిలో ఎక్కువ కేసులు లబ్ధిదారుడి నుంచి డబ్బులు తీసుకొని, మళ్లీ రీఫండ్ చేసినట్టు ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ కలెక్టర్‌కు తెలిపారు. డబ్బులు ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది, ఎందుకు రీఫండ్ చేయాల్సి వచ్చిందన్న అంశంపై కోఆర్డినేటర్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. ఆస్పత్రికి వచ్చేలోపలే ప్రాథమికంగా కొన్ని పరీక్షలు చేసుకొని కొంత మొత్తం ఖర్చుచేసి వస్తున్నారని, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించినప్పటికీ ఈవీఆర్ఎస్ కాల్స్‌లో ముందు చెల్లించిన దానినే లబ్ధిదారులు చెబుతున్నారని ఆస్పత్రుల ప్రతినిధులు కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ లబ్ధిదారునికి ఇబ్బంది కల్గించే ఏ చర్యలైనా తప్పుగానే పరిగణించడం జరుగుతుందన్నారు. ఇకపై ప్రతినెల ఆరోగ్యశ్రీ కేసులపై సమీక్షిస్తామని చెప్పారు. సమావేశాలకు ఫిర్యాదుదారులు కూడా హాజరు కావాలన్నారు. ఆరోగ్యశ్రీ బిల్లులు జిల్లాలో సుమారు రూ.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆస్పత్రుల నిర్వాహకులు కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹111	₹192	₹202

నిండుకుండలా జలాశయాలు



సాక్షి, పార్వతీపురం మన్యం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం జిల్లాపై అంతగా ప్రభావం చూపలేదు. జిల్లా అంతటా ఓ మోస్తరు వానలే కురిశాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద నీరు భారీగా రావడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకుంది. ఒడిశాలో కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని పలు ప్రాజెక్టులు, నదులకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో ముందు జాగ్రత్తగా అధికారులు తోటపల్లి, పెద్దగెడ్డ, వట్టిగెడ్డ, వెంగళరాయ సాగర్‌ల నుంచి నీటిని విడిచిపెడుతున్నారు. వాగులు, నదుల వద్దకు ఎవరూ వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. జియ్యమ్మవలస మండలంలోని తోటపల్లి ముంపు గ్రామం బాసంగి, కొమరాడ మండలంలోని జంఝావతి, నాగావళి నదీ తీర ప్రాంతాలైన కూనేరు, పూర్ణపాడు, కళ్లికోట, దుగ్గి తదితర గ్రామాలు.. పాలకొండ మండలంలోని ఓనిగెడ్డ, వరహాలరెడ్డ సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్లు, పోలీసు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ప్రాజెక్టు	పూర్తి నీటి సామర్థ్యం (మీటర్లు)	ప్రస్తుత నీటి సామర్థ్యం(మీటర్లు)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కులు)
తోటపల్లి ప్రాజెక్టు	105	103.98	2530	1260
వట్టిగెడ్డ రిజర్వాయర్	121.62	117.59	228	225
పెద్దగెడ్డ	213.80	213.50	120	120
వెంగళరాయసాగర్	161	160.25	300	300
పెదంకలాం ఆనకట్ట	-	-	300	300
జంఝావతి రిజర్వాయర్	-	122.60	328	328

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్



రిజర్వేషన్లలో ప్రాధాన్యం కల్పించాలంటూ రెల్లి రిజర్వేషన్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగిన ఆ సామాజిక వర్గం ప్రజలు

సమస్యలు పరిష్కారం కోరుతూ వివిధ వర్గాల ప్రజల ధర్నాలు, నిరసన ప్రదర్శనలతో సోమవారం విజయనగరం కలెక్టరేట్ దద్దరిల్లింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. అర్హుల పింఛన్ల తొలగింపు చర్యలు ఆపాలంటూ అవ్వాతాతలు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన బకాయిలు చెల్లించాలంటూ పాఠశాలల భోజన నిర్వాహకులు ఆందోళన చేశారు. రిజర్వేషన్ల కల్పనలో రెల్లికులస్తులకు న్యాయం చేయాలంటూ ఆ సామాజిక వర్గ ప్రజలు పెద్ద ఎత్తున ధర్నా చేశారు.

- ప్రభుత్వ మద్యం దుకాణాల విధానం రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రకటించడంతో ఆ వ్యవస్థలో పనిచేస్తున్న వివిధ కేడర్ ఉద్యోగులు ఆదోళనకు దిగారు. ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వేలాది కుటుంబాల పొట్టకొట్టొద్దని ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి సాయికుమార్, ఎస్.చిరంజీవి తదితరులు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉపాధి కల్పిస్తే.. కూటమి ప్రభుత్వం ఉపాధి లేకుండా చేస్తోందని విమర్శించారు.
- తక్షణమే ఐదునెలల వేతన బకాయిలు చెల్లించాలంటూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య ఆయాలు పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. వేతనాలు చెల్లించకుంటే అక్టోబర్ 2 నుంచి సామూహిక సత్యాగ్రహ దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఏపీ స్కూల్స్ అండ్ కాలేజెస్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఆయాలు పాల్గొన్నారు. కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు.

– విజయనగరం అర్బన్



కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్న మద్యం దుకాణాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులు



జీతాలు చెల్లించాలంటూ స్కూల్ ఆయాల నిరసన ప్రదర్శన



మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన